
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
శనివారం 7 సెప్టెంబరు 2024



ఫిషరీస్ ప్రాసెసింగ్ హబ్‌గా భారత్
- టూనా చేపల ఎగుమతి కేంద్రంగా అండమాన్ దీవుల అభివృద్ధి
- కేంద్ర మత్స్య శాఖా మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ - 7లో



మళ్లీ ముసురు!

అల్పపీడన ప్రభావంతో భారీ వర్షం



సీలేరులో వర్షం

- చిత్తడిగా మారుతున్న రోడ్లు
- జనజీవనానికి అంతరాయం
- చింతూరు డివిజన్‌లో వరదలు

పాడేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): **బంగాళాఖాతంలోని ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ కాయగా, ఆ తర్వాత నుంచి వాతావరణం మారిపోయి వర్షం మొదలైంది. దీంతో రోడ్లన్నీ జలమయం కాగా.. జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.**

జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వాతావరణ శాఖ ప్రకటించినట్టుగానే అల్పపీడనం ప్రభావం చూపడంతో శుక్రవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. దీంతో రోడ్లన్నీ చిత్తడి మారడంతోపాటు పంట పొలాల్లోని వర్షం నీరు వచ్చి చేరింది. దాదాపుగా అన్ని మండలాల్లో భారీగా వర్షం కొనసాగుతున్నది. తాజా వర్షానికి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించలేదు. ప్రస్తుత వర్షాలు పాడేరు, రంపచోడవరం డివిజన్‌లపై పెద్దగా ప్రభావం చూపనప్పటికీ చింతూరు డివిజన్‌పై తీవ్ర ప్రభావం చూసే అవకాశముందని అధికారులు అంటున్నారు. తాజా వర్షాల కారణంగా గోదావరి, శబరి నదుల్లోకి వరద నీరు అధికంగా వచ్చి చేరితే చింతూరు, ఏటపాక, వీఆర్.పురం, కూనవరం మండలాల్లో పలు గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదముందని వారంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని అధికారులు, సిబ్బందిని జిల్లా అధికారులు అప్రమత్తం చేశారు.

సీలేరులో కుండపోత

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి కుండపోతగా వర్షం కురుస్తున్నది. భారీ వర్షానికి సీలేరు జెన్‌కో కాలనీతోపాటు అల్లూరి వీధి, దుర్గా వీధిల్లో డ్రైన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉదయం నుంచి వర్షం తగ్గుముఖం పట్టకపోవడంతో వినాయక చవితి మండపాల పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. కుండపోత వర్షానికి సీలేరులో తెల్లవారుజామున గంటపాటు విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. భారీ వర్షం కారణంగా రోజువారీ కూలీలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ముంచంగిపుట్టులో..

మండల పరిధిలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. వాగులు, వంకలు, మత్స్యగెడ్డ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జోలాపుట్టు, డుడుమ జలాశయాలకు ఇన్‌ఫ్లో పెరిగింది.

అరకులోయలో

అరకులోయలో శుక్రవారం ఉదయం నుంచి మబ్బు పట్టి ఉంది. మధ్యాహ్నం నుంచి ... మిగతా 6వ పేజీలో



ముంచంగిపుట్టులో వాన

నీరు-చెట్టు బకాయిలు విడుదల

ప్రస్తుతం రూ.3.49 కోట్లు ...

- కోర్టుకు వెళ్లిన వారికి తొలి ప్రాధాన్యం
- 2014-19 మధ్య ఉమ్మడి జిల్లాలో రూ.44.5 కోట్లతో 715 పనులు
- బిల్లులు పెండింగ్‌లో పెట్టిన వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వం రాకతో మంజూరు

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వ హయాం(2014-2019)లో నీరు-చెట్టు పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి కూటమి ప్రభుత్వం తాజాగా రూ.3,49,67,926 మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. బిల్లుల కోసం కోర్టుకు వెళ్లిన వారికి తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. కోర్టుకు వెళ్లినా గత ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడంతో కొందరు హైకోర్టులో ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేశారు. కోర్టు ధిక్కారణ పిటిషన్లు వేసిన వారికి తొలుత బిల్లులు ఇవ్వాలని, తదుపరి కోర్టును ఆశ్రయించిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా చోడవరం కేంద్రంగా పనిచేస్తున్న వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ డివిజన్‌లో 15 పనులకు సంబంధించి కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేసిన ఏడుగురికి రూ.1,13,28,113, కోర్టును ఆశ్రయించిన మరో ఐదుగురికి రూ.37,26,309 విడుదల చేశారు. అలాగే నర్సీపట్నం రెగ్యులర్ డివిజన్ పరిధిలో 19 పనులకు కోర్టు ధిక్కారణ పిటిషన్లు చేసిన ఎనిమిది మందికి రూ.1,50,54,422, పాడేరు చిన్ననీటి పారుదల డివిజన్ పరిధిలో రెండు పనులకు సంబంధించి కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేసిన ఇద్దరికి రూ.27,57,533 విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లాలో నీరు-చెట్టు కింద 2019 వరకు రూ.44.5 కోట్ల విలువైన 715 పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పనులకు బిల్లులు ఇవ్వలేదు సరికదా రెండు, మూడు పర్యాయాలు విచారణ చేపట్టింది. ఆ తరువాత కూడా బిల్లుల విషయం తేల్చకపోవడంతో పలువురు కోర్టుకు వెళ్లారు. బిల్లులు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో వారిలో ఎక్కువ మంది కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 89 పనులకు రూ.7.7 కోట్లు విడుదల చేసినా సీఎంఎఫ్ఎస్‌లో బిల్లులు పూర్తిగా రాలేదని చెబుతున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావల్సి ఉంది. ఈలోగా ప్రభుత్వం మారడంతో బిల్లుల విషయం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లగా అన్ని జిల్లాలకు కలిపి రూ.200 కోట్లు విడుదల చేయగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 41 పనులకు రూ.3.49 కోట్లు మంజూరుచేశారు. త్వరలో సొమ్ములు సంబంధిత కాంట్రాక్టర్ల ఖాతాకు జమ కానున్నాయి. మిగిలిన పనులకు త్వరలో నిధులు విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటన

యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన జిల్లా అధికారులు

- గోదావరి, శబరి నదుల ప్రవాహ ప్రాంతాల సందర్శన
- నిత్యావసర సరకులు, దోమ తెరలు పంపిణీ
- ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా
- ప్రమాదకరంగా ఉన్న రోడ్లు మూసివేత



వీఆర్.పురం చింతరేగుపల్లి ప్రాంతంలో రోడ్డు మూసే ప్రాంతానికి పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చింతూరు రెవెన్యూ డివిజన్‌లో వరదలు రావడంతో జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్ హుటాహుటిన గురువారం రాత్రే చింతూరు తరలివెళ్లారు. శుక్రవారం గోదావరి, శబరి నదుల ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందస్తు సహాయక, పునరావాస చర్యలపై స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ వీఆర్.పురం మండలంలోని శ్రీరామగిరి గ్రామాన్ని సందర్శించి, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవితో కలిసి అక్కడ వరద బాధితులకు దోమ తెరలను పంపిణీచేశారు. అలాగే సీతంపేట, శ్రీరామగిరి గ్రామాల్లోని ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. అలాగే వరద ప్రభావం ఉన్న 31 గ్రామాల్లోని 3,436 కుటుంబాలకు రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నారు. ఈక్రమంలో అధికారులు, సిబ్బంది సైతం ఆయా గ్రామాలకు బోట్లపై రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న వీఆర్.పురం మండలంలో 6, కూనవరంలో 4, చింతూరులో 8, ఏటపాకలో 3 మార్గాలను మూయించివేశారు. వీఆర్.పురం మండలం చింతరేగుపల్లిలో వరద ఉధృతి వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా మూయించిన రోడ్డు మార్గాన్ని కలెక్టర్ పరిశీలించారు. అలాగే ప్రమాదభరితంగా ఉన్న ప్రాంతాల్లో రాకపోకలను నిలుపుదల చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతానికి జిల్లా అధికారులు స్థానిక మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేయడంతో ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించలేదు.

పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఎస్పీ

చింతూరు పోలీస్ యంత్రాంగాన్ని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ అప్రమత్తం చేశారు. గురువారం నుంచే వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టికి సారించాలని చింతూరు సీఐ, చింతూరు, ఏటపాక, కూనవరం, మోతుగూడెం, గంగవరం, వీఆర్.పురం ఎస్ఐలను ఆదేశించారు. అలాగే శుక్రవారం ఆయన కూనవరం, ఏటపాక ప్రాంతాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను స్వయంగా సందర్శించారు. అలాగే కూనవరం సమీపంలోని శబరి వంతెన వద్ద వరద నీటి ప్రవాహాన్ని ఎస్పీ పరిశీలించారు. అలాగే గోదావరి, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో వంతెనలు, రోడ్లపై వాహనాలు, ప్రజల రాకపోకలను నిలిపివేయాలని ఎస్పీ సూచించారు.



కూనవరం శబరి వంతెన వద్ద వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అమిత్‌బర్దార్

బెల్లం వినాయకుడు సిద్ధం

మండపాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చిన విశాఖ పోలీస్ కమిషనర్



జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో గల గాజువాక ఆర్టీసీ డిపో పక్కనున్న ఏపీఐఐసీకి చెందిన స్థలంలో స్థానిక లంబోదర ట్రస్ట్ నిర్వాహకులు 75 అడుగుల ఎత్తు, 24 అడుగుల వెడల్పు కలిగిన బెల్లం వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఇందుకు 20 టన్నుల బెల్లం వినియోగించారు. ఈ మండపాన్ని శుక్రవారం రాత్రి నగర పోలీస్ కమిషనర్ శంకబ్రతబాగ్చీ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రత్యేకంగా వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపం వద్ద బందోబస్తు ఎక్కువగా ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. - మల్కాపురం

విద్యా శాఖ జేడీ ఆకస్మిక తనిఖీలు

- పాడేరులోని కేజీబీవీ, ప్రభుత్వ హైస్కూల్ సందర్శన



పాడేరు కేజీబీవీలో సిబ్బందితో మాట్లాడుతున్న విద్యాశాఖ జేడీ కృష్ణారెడ్డి

పాడేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ సంయుక్త సంచాలకుడు (జేడీ) ఎంవీ.కృష్ణారెడ్డి మండల కేంద్రంలోని పలు విద్యాలయాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అలాగే విద్యార్థుల భోజన మెనూ, పరిశుభ్రత, వారి ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. అలాగే పలువురు విద్యార్థులతో మాట్లాడి అభ్యాసనా పఠిమను పరిశీలించారు. విద్యాభివృద్ధికి ... మిగతా 6వ పేజీలో

మార్కెట్‌లో చవితి సందడి

కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిట

పాడేరురూరల్, సెప్టెంబరు 6: **హిందువుల ప్రథమ పండగ వినాయక చవితి పురస్కరించుకొని శుక్రవారం పాడేరు మార్కెట్‌లో సందడి నెలకొంది. శనివారం నిర్వహించే గణపతి పూజకు అవసరమైన పూజా సామగ్రి కొనుగోలుకు పట్టణంలోని ప్రధాన మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది.**

- వినాయక విగ్రహాలు, పూజాసామగ్రి ధరలకు రెక్కలు
- వాహనాలతో రద్దీగా మారిన రహదారులు
- వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు



వినాయక చవితి సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్



చవితి పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

పాడేరు డివిజన్ పరిధిలోని పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన ప్రజలు వినాయక విగ్రహాలు, మండప అలంకరణ, పూజా సామగ్రి కొనుగోలుకు శుక్రవారం ఉదయం 10 గంటలకే చేరుకోవడంతో పట్టణంలో షాపులు రద్దీగా మారాయి. పరిసర గ్రామాల ప్రజలు కొనుగోలు చేసిన భారీ విగ్రహాలను ప్రైవేటు వాహనాల్లో గ్రామాలకు తరలించారు. పట్టణంలోని సుండ్రుపుట్టు, నక్కలపుట్టు గ్రామాల్లో ఏర్పాటు చేసే విగ్రహాలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎక్స్‌కవేటర్ల ద్వారా తరలించారు. అదేవిధంగా ఇళ్లల్లో చవితి వేడుకల కోసం వినాయక విగ్రహాలు, పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు మహిళలు మార్కెట్‌కు భారీగా తరలివచ్చారు. పూజ సామగ్రికి ధరలకు రెక్కలు వచ్చాయి. సాధారణ ... మిగతా 6వ పేజీలో



వాహనదారులతో రద్దీగా మారిన పాడేరు మెయిన్ రోడ్డు

మీకోసంపై నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

అధికారులకు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరిక

- అనుమతి లేకుండా బయటకు వెళ్లిన ఈపీడీసీఎల్ ఈఈకి షోకాజ్ నోటీసు
- 109 వినతుల స్వీకరణ



మీ కోసం కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న అధికారులు

పాడేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీ కోసం' కార్యక్రమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అధికారులను హెచ్చరించారు. ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం మీ కోసం కార్యక్రమం జరుగుతుండగా ఎటువంటి అనుమతి తీసుకోకుండా అధికారులు బయటకు వెళ్లి పోవడాన్ని ఆయన తప్పుబట్టారు. తమ కింది స్థాయి సిబ్బందిని మీ కోసం కార్యక్రమానికి పంపించి, అధికారులు హాజరు కావడంలేదని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎటువంటి అనుమతి లేకుండా బయటకు వెళ్లిన ఈపీడీసీఎల్ ఈఈ అప్పారావుకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిని పీవో అభిషేక్ ఆదేశించారు. మీకోసం వినతులను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమస్యలు పరిష్కారంలో పక్కాగా ఉండాలని, పలువురు అధికారులు ఫైళ్లు వాట్సాప్‌లో పంపించడం, వాటి పరిష్కారంలో అలసత్వం, నిర్లక్ష్యం కనపడుతుందన్నారు. ఫైళ్లను ఉన్నతాధికారులకు పంపించే క్రమంలో బాధ్యతగా వ్యవహరించాలని ఐటీడీఏ పీవో సూచించారు. ఇటువంటివి పునరావృతమైతే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

109 వినతులు స్వీకరణ

ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ వివిధ సమస్యలపై ప్రజల నుంచి 109 వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.జమాల్ బాషా, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు, టీడబ్ల్యూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్ కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
MVP కాలనీ-2 బ్రాంచ్ (10461)
ఎ.ఎస్. రాజా జూ॥ ఉమెన్స్ కాలేజ్ ఎదురుగా, సెక్టార్-10, MVP కాలనీ, విశాఖపట్నం-530017.

[రూల్ 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, విశాఖపట్నం అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, అందలి రూలు 3 తో కలిపి చదవవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ 30.05.2024 వ తేదీన జారీచేసిన డిమాండ్ నోటీసు మీకు అందిన తేది నుండి 60 రోజుల లోపు నోటీసులో పేర్కొనబడిన సదరు బకాయి రూ. 6,36,143.19/- (అక్షరాల ఆరు లక్షల ముప్పై ఆరు వేల నూట నలభై మూడు రూపాయలు మరియు పంతొమ్మిది పైసలు) మొత్తమును తిరిగి చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు/హామీదారులు అయిన శ్రీ చోడిశెట్టి శ్రీరామ్ గారిని కోరుతూ డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత మరియు హామీదారులు బకాయి మొత్తమును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని తేది 03.09.2024న స్వాధీనపరచుకున్నారని ఋణగ్రహీతలు/హామీదారులు & ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారులను హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించి ఎట్టి లావాదేవీలు జరిపిన అవి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, MVP కాలనీ-2 బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బకాయి రూ.6,36,143.19/- (అక్షరాల ఆరు లక్షల ముప్పై ఆరు వేల నూట నలభై మూడు రూపాయలు మరియు పంతొమ్మిది పైసలు) + వడ్డీ మరియు ఇతర ఖర్చులు కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సదరు చట్టం సందలి సెక్షన్ 13(8) ప్రకారం, సెక్యూర్డ్ ఆస్తులను తీసు, అప్పగించుట లేదా విక్రయించుట ద్వారా జరిపివేయుట కొరకు బహిరంగ వేలం లేదా ప్రజల నుండి కొటేషన్లు లేదా టెండర్లు కోరుట లేదా ప్రైవేటు ఒప్పందం కొరకు అమ్మకపు నోటీసు ప్రచురణ తేదీకు ముందుగా ఏ సమయంలోనైనా పైన తెలిపిన మొత్తంతో పాటు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు మాకు సంభవించిన వ్యయాలు అన్నింటినీ చెల్లించి సెక్యూర్డ్ ఆస్తులను మీరు విడిపించుకోవలసినదిగా కోరడమైనది.

స్థిరాస్తి వివరములు:
(యలమంచిలి ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం. 89/2015 ప్రకారం శ్రీ చోడిశెట్టి శ్రీరామ్ పేరున గల ఆస్తి): విశాఖపట్నం జిల్లా, యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా, దుప్పితూరు గ్రామం, ఎస్.నెం. 50/2, 51/2, 52, 55, ప్లాట్ నెం.లు.57, 58, 74 & 75, ఎల్.పి.నెం. 4/2013 ద్వారా ఉడా ఆమోదించిన లేఅవుట్ (క్రాంతి ప్యారడైజ్), మొత్తము 1111.11 చ॥గ॥లో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు స్థలం వాటా 37.03 చ॥గ॥ లేదా 30.96 చ॥మీ॥. స్థలానికి హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 59, దక్షిణం: 40 అ॥ వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.56, ఉత్తరం: 40 అ॥ వెడల్పు రోడ్డు.
"జోగేశ్వర్ సదన్" మూడవ అంతస్తులోని సూపర్ బిల్టప్ ఏరియా 955 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాలు మరియు బాల్కనీలు కలుపుకొని) మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లోని కారు పార్కింగ్ ఏరియా 80 చ॥అ॥ గల ఫ్లాట్ నెం. 404. మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 404కు హద్దులు: తూర్పు: సెట్‌బ్యాక్ లేదా శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఫ్లాట్ నెం. 56, ఉత్తరం: ఫ్లాట్ నెం. 401, పైన: ఫ్లాట్ నెం.501, క్రింద: ఫ్లాట్ నెం. 301.

తేది: 03.09.2024
ప్రదేశం: విశాఖపట్నం
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 6 : మండలంలోని నామవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. నామవరం గ్రామానికి చెందిన కోన అప్పారావు (69) శుక్రవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో అక్కడి చర్చి వద్ద నుంచి తుని సైకిల్‌పై వెళుతున్నాడు. ఇంతలో నక్కపల్లి నుంచి తుని వైపు వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమార్తె కుంట్ల భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఉపాధి కూలీకి తీవ్ర గాయాలు

» పరిస్థితి విషమం

పరవాడ, సెప్టెంబరు 6 : విద్యుత్ షాక్‌కు గురై ఉపాధి హామీ పథకం కూలీ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. మండలంలోని తానాం గ్రామానికి చెందిన చీపురుపల్లి అప్పారావు (58) ఉపాధి కూలీగా పనిచేస్తున్నాడు. క్లీన్ ఆంధ్రా- గ్రీన్ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక కంసాలి చెరువులో ఇటీవల నాటిన కొబ్బరి మొక్కలకు శుక్రవారం అతడు కంచె ఏర్పాటు చేస్తున్నాడు. చెరువు పై నుంచి ఎగువ సీలేరు- పెందుర్తి వరకు 220 కేవీ విద్యుత్ టవర్‌లైన్ ఉంది. విద్యుత్ తీగలు కిందకు వేలాడి ఉండడంతో కొబ్బరి మొక్కలకు కంచె కడుతున్న అప్పారావుకు తగలడంతో 80 శాతం శరీరం కాలిపోయింది. వెంటనే స్థానికులు విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇదిలావుంటే, టవర్‌లైన్ విద్యుత్ తీగలు కిందకు వేలాడి ఉన్నాయని స్థానికులు గతంలోనే ఏపీ ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో ఈ సంఘటన చోటు చేసుకుందని పలువురు ఆరోపిస్తున్నారు. బాధితుడ్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

రాంబిల్లి, సెప్టెంబరు 6 : మండలంలోని వాడ నర్సాపురంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమ్మిడి మహాలక్ష్మి (55) అనే మహిళ మృతి చెందినట్టు సీఐ చిల్లా నర్సింగరావు తెలిపారు. రాత్రి ఏడు గంటల సమయంలో పాల ప్యాకెట్ కోసం గ్రామంలోని రోడ్డుపై నడిచి వెళ్తుండగా, కొత్తపట్నం వైపు నుంచి వచ్చిన ట్రాక్టర్ వెనుకనుంచి బలంగా ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలకు గురైన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామ సర్పంచ్ కారె రామారావు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

అనంతగిరి, సెప్టెంబరు 6: మండలంలోని ఎగువశోభ పంచాయతీ సరసపోదర్ గ్రామానికి చెందిన కొనేపు డొమ్ని (47) మృతి చెందారు. కమలపురం, జామిగుడ మధ్యలోని గెడ్డ దాటుతుండగా గురువారం డొమ్ని ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టగా గెడ్డ సమీపంలోని మృతదేహం లభ్యమైంది. అనంతగిరి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలోని గెడ్డ ఉధృతికి డొమ్ని కొట్టుకుపోయి ఉంటారని స్థానికులు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఎంపీపీ నీలవేణి డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ

అనకాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ట్రాన్స్‌జెండర్ల పోర్టల్‌లో లాగిన్ అయి గుర్తింపు కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం ఇక్కడ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్, ఎస్పీలు వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ జగదీష్, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

ఉధృతంగా చెరువూరు వాగు

» అతికష్టం మీద వాగు దాటుతున్న ఆదివాసీలు

» వంతెన నిర్మించాలని వినతి



పిల్లలను భుజాలపై ఎత్తుకుని వాగు దాటుతున్న గిరిజనులు

చింతపల్లి, సెప్టెంబరు 6: గిరిజన ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఏవోబీలోని చెరువూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో శుక్రవారం ఆదివాసీలు చేయిచేయి పట్టుకుని, కర్రల సహాయంతో వాగు దాటారు. ఈ సందర్భంగా స్థానిక ఆదివాసీలు విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం చెరువూరు వాగు వద్ద బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదన్నారు. గతంలో ఈ వాగులో ఇద్దరు గిరిజనులు కొట్టుకుపోయి మృతి చెందారని, ఎనిమిది గ్రామాల గిరిజనులు నిత్యం వాగు దాటి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. నిత్యవసర సరకులు తెచ్చుకునేందుకు, రోగులు, గర్భిణులను వాగు దాటించేందుకు అవస్థలు పడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి కృషిచేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిషరీస్ ప్రాసెసింగ్ హబ్‌గా భారత్

» టూనా చేపల ఎగుమతి కేంద్రంగా అండమాన్ దీవుల అభివృద్ధి

» కేంద్ర మత్స్య శాఖా మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్



సమావేశంలో పాల్గొన్న కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, పక్కన కేంద్ర సహాయ మంత్రి కురియన్

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని ఇంటర్నేషనల్ ఫిషరీస్ ప్రాసెసింగ్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని కేంద్ర మత్స్య, పశు సంవర్థక శాఖా మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ వెల్లడించారు. మత్స్య ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడానికి సంబంధిత రంగాల నిపుణులు, వ్యాపారులు, ఎగుమతిదారులతో విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో భారతదేశం రెండో స్థానంలో ఉందన్నారు. టూనా చేపల ఎగుమతి కేంద్రం అండమాన్, లక్ష దీవులను అభివృద్ధి చేస్తామని, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. లక్ష్య సాధన కోసం ఫిషరీస్ రంగాన్ని డిజిటలైజేషన్ చేస్తామన్నారు. రొయ్యల ఎగుమతులు మరింత పెంచడానికి న్యూక్లియస్ బ్రీడింగ్ సెంటర్లపై దృష్టిపెట్టామని, వీటి కోసం బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించామన్నారు. కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద ఐదు రోజుల క్రితమే 218 కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామన్నారు. మత్స్య రంగానికి గత ఏడాది కంటే ఈ ఏడాది 54 శాతం అధికంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారన్నారు. ఒక్క పీఎంఎస్ఎస్‌వై కిందే ఈ ఏడాది రూ.2,352 కోట్లు ఖర్చు చేయబోతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ ఇలియాస్, అధ్యక్షులు రవికుమార్ ఎల్లంకి, ప్రాన్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు పీఆర్ మోహన్‌రాజు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్రాగ్	రూ.లలో
బ్రైటు ధర	88.00
లైవ్ ధర	108.00
విత్ స్కిన్	186.00
స్కిన్ లెస్	196.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

అనకాపల్లి మార్కెట్‌కు చవితి శోభ

» పూజా సామగ్రి కొనుగోలుకు భారీగా జనం రాక

» ఎటుచూసినా కోలహల వాతావరణం

» ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు బందోబస్తు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6: వినాయక చవితి సందర్భంగా అనకాపల్లి మార్కెట్ కిటకిటలాడింది. శుక్రవారం జరగనున్న ఈ వేడుకల్లో స్వామికి పూజలు నిర్వహించేందుకు సామగ్రి కొనుగోలుకు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది.



నెహ్రూచౌక్‌లో పూజా సామగ్రి కొనుగోలుకు తరలి వచ్చిన జనం



వినాయక విగ్రహాల అమ్మకాలు

నెహ్రూచౌక్, చిన నాలుగురోడ్ల జంక్షన్, చింతావారి వీధి, పెరుగుబజార్, ఉడ్‌పేట తదితర ప్రాంతాల్లో పూజా సామగ్రి అమ్మకాలు ఊపందుకున్నాయి. వినాయక విగ్రహాలు, పత్రులు, పాలవెల్లి, పువ్వులు, పసుపు కుంకుమలు, కొబ్బరికాయలు, వివిధ రకాల పండ్లు తదితరాలు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది వినాయక విగ్రహాల ధరలు కొద్దిగా పెరిగాయని చెపుతున్నారు. మిగతా పూజా సామగ్రి ధరలు అందుబాటులోనే ఉన్నాయని అంటున్నారు. ఇదిలావుంటే, మార్కెట్‌కు భారీగా జనం రావడంతో పలు రహదారులు రద్దీగా మారాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ఎక్కడికక్కడ బందోబస్తు నిర్వహించారు.

పంచాయతీ నిధులు పక్కదారిపై విచారణ

» సర్పంచ్ గైర్హాజరు

మాకవరపాలెం, సెప్టెంబరు 6: మండలంలోని జి.కోడూరు పంచాయతీలో నిధులు పక్కదారి పట్టాయంటూ ఫిర్యాదు అందడంతో శుక్రవారం విచారణ చేపట్టారు. వీధిలైట్లు, పారిశుధ్యంకు సంబంధించిన, అలాగే 14, 15 ఆర్థిక సంఘాల నిధులు దుర్వినియోగం అయినట్టు స్థానిక టీడీపీ నాయకుడు మళ్ల జగన్నాథరావు (జయరాం) ఇటీవల రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీపీవో విచారణకు ఆదేశించారు. సబ్బవరం ఈవోపీఆర్డీ మహేష్ ఆధ్వర్యంలో పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాకవరపాలెం ఎంపీడీవో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్ అనారోగ్యంతో ఉండడంతో హాజరు కాలేనని చెప్పారన్నారు. ఆయన గైర్హాజరు కావడం ఇది రెండోసారి అని తెలిపారు. దీంతో శుక్రవారం పంచాయతీ రికార్డులను తనిఖీ చేశామని, చివరిసారిగా సర్పంచ్‌ను విచారణకు పిలుస్తామని చెప్పారు. అనంతరం రిపోర్టును ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు వెల్లడించారు.



జి.కోడూరు సచివాలయంలో విచారణ చేస్తున్న అధికారులు

విజయవాడ వరద బాధితులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు తరలింపు





వ్యాన్‌లో బయలుదేరిన సామగ్రి, వాటర్ బాటిళ్లు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6: విజయవాడలో వరద ముంపునకు గురైన బాధితులకు రెవెన్యూ అధికారులు గురువారం రాత్రి నిత్యావసర సరకులను ఇక్కడి నుంచి పంపించారు. తుఫాన్ బాధితుల సహాయార్థం పలువురు దాతల సహాయ సహకారాలతో ఐదు లక్షల రూపాయల విలువైన పాల ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, నిత్యావసర సరుకులను ఆర్డీవో చిన్నికృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో రెండు వాహనాల్లో విజయవాడకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

లారస్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలు పంపిణీ

అచ్యుతాపురం, సెప్టెంబరు 6: ఎస్ఈజెడ్‌లో గల లారస్ కర్మాగారం ఆధ్వర్యంలో శుక్రవారం సెజ్ పునరావాస కాలనీలో సుమారు రెండు వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సంస్థ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) మెహర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారావు చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను అంతా ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ.. అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.



సెజ్ పునరావాస కాలనీలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న సంస్థ జీఎం మెహర్ కుమార్

త్వరలోనే అనకాపల్లిలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ప్రారంభం

కె.కోటపాడు, సెప్టెంబరు 6: మహిళ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ అనకాపల్లిలో త్వరలో ప్రారంభించనున్నట్టు సీడీపీవో వి.మంగతాయారు శుక్రవారం విలేకరులకు తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల నుంచి అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఉద్యోగం చేసేందుకు వెళ్లే మహిళలు అనకాపల్లి హాస్టల్‌లో ఉండి ఉద్యోగం చేసుకోవడానికి అంగీకారమైతే మీ వివరాలు ఐసీడీఎస్ ప్రాజెక్టు, కె.కోటపాడు ఆఫీస్‌కు అందజేయాలన్నారు. సమాచారం కోసం ఫోన్: 94910 51541కు సంప్రదించాలన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంగతాయారు

నిండుకుండలా కోనాం

» ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరిక

» గేట్లు ఎత్తి 1,900 క్యూసెక్కులు విడుదల



కోనాం స్పిల్‌వే గేట్ల ద్వారా వెళుతున్న వరద నీరు

చీడికాడ, సెప్టెంబరు 6: మండలంలోని కోనాం జలాశయానికి భారీగా వరద పోటెత్తింది. దీంతో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. జలవనరుల శాఖ అధికారులు ప్రాజెక్టు స్పిల్‌వే గేట్లను ఎత్తి అదనపు నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. కోనాం రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, పరివాహక ప్రాంతమైన పాడేరు, హుకుంపేట, అనంతగిరి మండలాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలోకి శుక్రవారం 1,800 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. దీంతో నీటి మట్టం 99.4 మీటర్లకు చేరింది. జలవనరుల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా స్పిల్‌వే గేట్లను ఎత్తి 1,900 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు సమాచారం పంపినట్టు ఏఈ జైరామ్ తెలిపారు.

ఇన్‌శానిటేషన్ లెట్రిన్ వివరాలపై సర్వే : కలెక్టరు

అనకాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-శానిటేషన్ లెట్రిన్ వివరాల సేకరణ కోసం సర్వే జరుగుతోందని కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-శానిటేషన్ లెట్రిన్ ఉంటే ఆ వివరాలను ఈనెల 10వ తేదీలోగా మున్సిపాలిటీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో తెలియజేయాలని ఆమె ప్రజలను కోరారు.

ఏఎస్పీ మోహనరావు బాధ్యతలు స్వీకారం



తుమ్మపాల, సెప్టెంబరు 6 : అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీగా ఎల్.మోహనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రిలో డీఎస్ఆర్‌బీగా విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడికి విచ్చేశారు. తొలుత జిల్లా ఎస్పీ ఎం. దీపికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

న్యాయ విద్యార్థులకు సామాజిక బాధ్యత

» న్యాయ విశ్వవిద్యాలయం సదస్సులో వక్తలు

సబ్బవరం, సెప్టెంబరు 6 : న్యాయ విద్యార్థులకు సామాజిక బాధ్యత మెండుగా ఉండాలని బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.మోహన్ గోపాల్ అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్య సమకాలీన సమస్యలు, సవాళ్లు అంశంపై శుక్రవారం విద్యార్థులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. నాడు బ్రిటీష్ దురాగతాలతో పాటు సామాజిక నిబంధనలను సవాల్ చేయడంలో న్యాయవాదులు ముందున్నారని పేర్కొంటూ స్వాతంత్ర్య పోరాటం నాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. వాటికి విరుద్ధంగా నేటి విద్యార్థులు సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించడం కంటే, తమ వ్యక్తిగత లబ్ధి కొరకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. విద్య సమాజంలోని వివిధ దృక్కోణాలపై లోతైన అవగాహనను పెంపొందిస్తుందని వివరించారు. నల్సార్ అండ్ ఎన్ఎల్‌యూ ఢిల్లీ వ్యవస్థాపక చాన్సలర్ ప్రొఫెసర్ రణబీర్ సింగ్, బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ పరిశోధన డీన్ ప్రొఫెసర్ మృణాల్ సతీష్ మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు సమాజానికి జ్యోతులుగా మారాలని ఉద్బోధించారు. అనంతరం వక్తలను ఇక్కడి వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశ్ జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ సోమా భట్టాచార్య, ప్రొఫెసర్ మృనాల్ సతీష్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

టన్ను చాక్లెట్‌తో అయోధ్య రాముడి విగ్రహం



గాజువాక (విశాఖపట్నం), సెప్టెంబరు 6: విశాఖ నగర పరిధిలోని గాజువాక శ్రీనగర్‌లో 89 అడుగుల వినాయక విగ్రహం చెంతనే టన్ను చాక్లెట్‌తో రూపొందించిన అయోధ్య రాముడి విగ్రహం కూడా ఏర్పాటుచేస్తున్నారు. రెండు విగ్రహాలకు 23 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విపత్తుల సమయంలో వైసీపీ బురద రాజకీయాలు

» మాజీ ఎమ్మెల్సీ 'బుద్ద' ఆగ్రహం



అనకాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో చేతనైన సాయం చేయాల్సింది పోయి వైసీపీ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శిస్తూ బురద రాజకీయాలకు తెర లేపారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మండిపడ్డారు. శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ విజయవాడకు 113 ఏళ్ల కిందట వరదలు వచ్చాయని, తరువాత మళ్లీ ఇటీవల వచ్చాయని తెలిపారు. వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం ముందుందన్నారు. కృష్ణలంక రిటర్నింగ్ వాల్ తామే కట్టామని వైసీపీ నేత జగన్ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవానికి రిటర్నింగ్ వాల్ నిర్మాణం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభిస్తే, మిగులు పనులు పూర్తిచేసి గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒడ్డిమెట్ట గణపతి ఆలయంలో ఉత్సవాలు

నక్కపల్లి, సెప్టెంబరు 6: ఉత్తరాంధ్రలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటైన నక్కపల్లి మండలం ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఇక్కడున్న కొండపై స్వామివారు స్వయం వ్యక్తమయ్యారు. ఈ ఆలయానికి 120 ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. ప్రస్తుతం దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఈ ఆలయ నిర్వహణ జరుగుతోంది. ఏటా వినాయక చవితి రోజున కాకినాడ, ఉమ్మడి విశాఖ జిల్లాల్లోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి విచ్చేసి దర్శించుకుంటుండడం ఆనవాయితీగా వస్తోంది. దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇక్కడే అక్షరాభ్యాసం చేయిస్తుంటారు. శనివారం నుంచి ఒడ్డిమెట్ట ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు. పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



ఒడ్డిమెట్ట ఆలయంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

వరద బాధితులకు విశాఖ ఫార్మాసిటీ రూ.10 లక్షలు విరాళం

పరవాడ, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విశాఖ ఫార్మాసిటీ రూ.10 లక్షలు విరాళాన్ని అందజేసింది. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.హరిప్రకాష్ అభ్యర్థన మేరకు రాష్ట్ర విపత్తు నివారణ సంస్థకు నెఫ్ట్ ద్వారా ఈ మొత్తాన్ని పంపించడం జరిగిందని విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధరభక్షి ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ కారణంగా ఏర్పడిన నష్టం ఎవరూ పూడ్చలేనప్పటికీ తమవంతు సాయంగా అందజేశామన్నారు. అలాగే, ఫార్మాసిటీ ఉద్యోగులు, స్థానిక కంపెనీ యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహాయం చేయాలని ఆయన కోరారు.



CLASSIFIEDS

FLATS FOR SALE

★ **Ready to Occupy** 2 BHK 1030 sft. Flats for Sale in Nature's Nest with quality construction, Near to Highway, Pollution's Free Zone, Semi Gated Community, Well Street Lighting, Beside Park & all these amenities have this project at Tagarapuvalasa. Cont.: **9866746418**
AJV_192596

FINANCE

గవర్నమెంట్ ఎంప్లాయిస్‌కి, రిటైర్డ్ పెన్షనర్లకి సులభవాయిదాలలో ఫైనాన్స్ మరియు ఇళ్ళు, స్థలాలపైన బ్యాంకులోను ఉన్నా సరే సెకండ్ మార్ట్‌గేజ్‌పై లోను 10లక్షల లోపు చెయ్యబడును. (సిబిల్ చూడబడదు) సెల్: 9666547338
AJH-186740

CHANGE OF NAME

★ I, Gajjala Rama Subhodaya Reddy S/o Gajjala Rama Krishna Reddy, Resident of D-176 Parawada Mandal / Deepanjalinagar NTPC Simhadri Township, Anakapalli, Andhra Pradesh 531020. I have changed the name of my minor son Gajjala Rama Viswadhip (old name) aged about 11 Years and he shall hereafter be known as Gajjala Visw Adhip Reddy (New name). It is certified that I have complied with other legal requirements in this connection. AJH-1443

CHANGE OF NAME

★ I, Gajjala Rama Subhodaya Reddy S/o Gajjala Rama Krishna Reddy, Resident of D-176 Parawada Mandal / Deepanjali-nagar, NTPC Simhadri Township, Anakapalli, Andhra Pradesh 531020. I have changed the name of my minor Daughter Gajjala Rama Anwita Reddy (Old name) aged about 14 Years and she shall hereafter be known as Gajjala Anwita Reddy (New name). It is certified that I have complied with other legal requirements in this connection. AJH-1444

రియల్ ఎస్టేట్

⇒ కంతేరు, కొప్పురావూరు, నంబూరు, కాజా, చిన్న కాకాని, గుంటూరు, గోరంట్ల, మంగళగిరిలో పొలాలు, ప్లాట్లు, అమ్మదలచిన, కొనదలచిన సంప్ర॥ దుర్గా రియల్ ఎస్టేట్: **99664 17186**
AJG_191827

PLOT FOR SALE

★ విశాఖలో పరవాడ టు అచ్యుతాపురం రోడ్డు ఐరువాడ గ్రామం దగ్గరలో ఉడా లే అవుట్ గ॥ 7500/-లకే & అగనంపూడి దువ్వాడలో ప్లాట్లు / ఇండివిడ్యువల్ హౌస్‌లు కలవు. స్పాట్ రిజి॥ సంప్ర॥ 9490639799
AJV_192597

» VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి మీ, బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ. 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్. ఫామ్ హౌస్‌ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర. **93985 76997.**
AJB_61

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

మాజీ మంత్రి కిడారి దృష్టికి స్టాఫ్‌నర్సుల సమస్యలు

పాడేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు తమ సమస్యలపై తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌కు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. చాలా ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ రెగ్యులర్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను గత వైసీపీ ప్రభుత్వం దృష్టికి అనేక మార్లు తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఏళ్ల తరబడి వైద్య సేవలందిస్తున్న తమను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా మాజీ మంత్రి కిడారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగస్వామి, సాగర సుబ్బారావు, అచ్చిబాబు, మురళీ, అప్పలరాజు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో...

చింతపల్లి: ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ చేయాలని కోరుతూ శుక్రవారం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. గిరిజన ప్రాంతంలో 11 ఏళ్లకుపైగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయకపోవడంతో ఉద్యోగ భద్రత లేదని వాపోయారు. గత ప్రభుత్వం ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చి స్టాఫ్‌నర్సులుగా పదోన్నతి కల్పించే కార్యక్రమాన్ని ప్రారంభించిందని, తొలుత తమను రెగ్యులర్ చేసిన తరువాత వారికి పదోన్నతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ మాత పద్మావతి, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

చింతపల్లి, సెప్టెంబరు 6: గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై హెచ్ఎం, హెచ్‌డబ్ల్యూవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి సూచించారు. చింతపల్లి, జీకే వీధి మండలాల హెచ్ఎంలు, హెచ్‌డబ్ల్యూవో, డిప్యూటీ వార్డెన్‌లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకొని వెళ్లి చికిత్స చేయించాలన్నారు. వ్యాధికి గురైన విద్యార్థిని తల్లిదండ్రులు ఒత్తిడి చేసినా గృహాలకు పంపించరాదన్నారు. సెలవులపై గృహాలకు వెళ్లిన విద్యార్థుల ఆరోగ్య సమాచారం తెలుసుకోవాలన్నారు. మెనూ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి వేళ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా పడుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మట్టి వినాయకుని పూజిద్దాం: ఎంపీ

పాడేరు రూరల్, సెప్టెంబరు 6: మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని అరకు ఎంపీ గుమ్మ తనూజ రాణి అన్నారు. మోద కిరణ్ మణికంఠ అన్నదాన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన మట్టి విగ్రహ పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మట్టి ప్రతిమలు పర్యావరణ హితమన్నారు. వినాయక ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ శివరాత్రి శ్రీనివాస్‌కుమార్, జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షులు దిలీప్, ట్రస్టు సభ్యులు బీవీఎస్.ముకుందరావు, సిద్ధినాతి కొండలరావు, ఎస్‌డీ.రవి, శ్యామల, రత్నం, మంగ, సింహాచలం పాల్గొన్నారు.

పీవీటీజీ గ్రామంలో పాఠశాల ప్రారంభం

పాడేరు రూరల్, సెప్టెంబరు 6: మినుములూరు పంచాయతీ పరిధిలోని సల్దిగెడ్డ పీవీటీజీ గ్రామంలో పాఠశాలను శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులకు గురై విద్యకు దూరమవుతున్నారని సర్పంచ్ చిట్టమ్మతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులు ఐటీడీఏ వద్ద ఆందోళన చేయడంతో విద్యాశాఖాధికారులు స్పందించారు. ఈ మేరకు పాఠశాలను నడిపేందుకు విద్యా వలంటీర్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేత లంకెల విశ్వేశ్వరరావు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయరూ...

డుంబ్రిగుడ, సెప్టెంబరు 6: మండలంలోని సొవ్వా పంచాయతీ కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేయించాలని పంచాయతీ బూత్ ఇన్‌చార్జి కమలాకర్, టీడీపీ నాయకులు వినతిపత్రాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడు తూకరకవలసలో అంగన్‌వాడీ కేంద్రం లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 41 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారన్నారు. వీరు ఐదు కిలోమీటర్ల దూరంలోనున్న మాలివలస కేంద్రానికి వెళ్లి పౌష్టికాహారాన్ని పొందుతున్నారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రం మంజూరయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా మాజీ మంత్రి కిడారి హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుమన్, దొన్ను, గాసి, మొద్దు తదితరులు పాల్గొన్నారు.







నూతన సాగు పద్ధతులపై అవగాహన కల్పించండి

- రైతులను వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ప్రోత్సహించాలి
- ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ భాస్కరరావు


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీపీఎం భాస్కరరావు

చింతపల్లి, సెప్టెంబరు 6: రైతులను నూతన సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) ఎల్.భాస్కరరావు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో కొయ్యూరు, గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల ఉద్యాన, వ్యసాయ సహాయకులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శుక్రవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. ఈ మేరకు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేసుకునేందుకు వ్యవసాయ, ఉద్యాన సహయాకులు ప్రోత్సహించాలన్నారు. ప్రధానంగా రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, రాగి, సామ, కొర్రల పంటలను రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. జీవామృతం, ఘన జీవామృతం, కషాయాలు, సేంద్రియ ఎరువులను పంటలకు ఉపయోగించాలన్నారు. రైతులు జీవామృతం, ఘన జీవామృతం, కషాయాలు తయారు చేసుకునే పద్ధతులను తెలియజేయాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే ఏడాది పొడవునా పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసుకున్న పంటలకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తున్నదన్నారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కంటా జాహ్నవి మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సేంద్రియ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించేలా ఉద్యాన, వ్యవసాయ సహాయకులు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల వ్యవసాయ శాఖాధికారులు బి.శ్రీనివాసరావు, టి.మధుసూదనరావు, ఉమాదేవి, ల్యాబ్ ఏవో బీవీ పద్మశోభ, ఎన్ఎఫ్ఏ కుమార్‌బాబు, ఎంటీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా..!

- కేజీబీవీ ఎస్‌వో పనితీరుపై ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆగ్రహం
- బాలికలకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశం


బాలికలతో మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 6: విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఎంపీ తనూజరాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అసహనం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని, ఎస్‌వో, అకౌంటెంట్‌లను బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ కిలగాడ కస్తూర్బాగాంధీ విద్యాలయ విద్యార్థినులు రోడ్డెక్కి ఆందోళన చేయడంపై వారు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం కేజీబీవీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. బాలికలతో మాట్లాడి వారి సాధకబాధలను తెలుసుకున్నారు. ఉడికీ ఉడకని అన్నం, రుచీపచీ లేని కూరలు పెడుతున్నారని, మెనూ సక్రమంగా అమలు కావడం లేదని, ప్రశ్నిస్తే కొడుతున్నారని, పాఠశాల ప్రత్యేక అధికారి (ఎస్‌వో) జ్యోతి, అకౌంటెంట్ పుష్పవతిని బదిలీ చేయాలని ఈ సందర్భంగా బాలికలు విన్నవించారు. అలాగే గదులు సరిపోవడంలేదని, పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, మరుగుదొడ్ల మరమ్మతు పనులు జరిగేలా చొరవ చూపాలని కోరారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యే విధంగా చూస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమై భోజనం అందించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎస్‌వోను వారు హెచ్చరించారు.

అనంతరం కేజీబీవీ పాఠశాలకు సంబంధించిన స్టాక్, విజిట్, తదితర రికార్డులను ఎమ్మెల్యే మత్స్యలింగం పరిశీలించారు. ఏ రికార్డు సక్రమంగా లేకపోవడం, పాఠశాలకు సంబంధించిన సరకుల వివరాలు తెలిపే రికార్డు రాయకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్తవ్యస్తంగా ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకొని, జిల్లా కలెక్టర్‌కు అందజేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి తగిన కృషి చేస్తామని, సమస్యలపై విద్యార్థులు రోడ్డు ఎక్కవద్దని, ఏ సమస్యనైనా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు చేపడతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, పెదబయలు జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచులు శివశంకర్, రమేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌మా సాగుతో గిరిజనుల ఆర్థికాభివృద్ధి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు

పాడేరు రూరల్, సెప్టెంబరు 6: గిట్టుబాటు ధర లభించే రాజ్‌మా సాగుతో గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు అన్నారు. మండలంలోని వంతాడపల్లి రైతు సేవా కేంద్రంలో వివిధ గ్రామాల రైతులకు శుక్రవారం రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక శాతం రాయితీతో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్నదన్నారు. మూడు నెలల్లో చేతికందొచ్చే రాజ్‌మా పంటతో రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందన్నారు. విత్తనాలు తీసుకున్న ప్రతీ రైతు పంటలు వేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఎం.సూర్యనారాయణ నాయుడు, పార్వతి, టీడీపీ నాయకులు బాలరాజు పాల్గొన్నారు. అలాగే


పాడేరులో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తులపుట్టు సచివాలయంలో చేపట్టిన విత్తన పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్, సర్పంచ్ సాగిన బాబూరావుపడాల్, పంచాయతీ కార్యదర్శి వంతాల పరశురాం, వ్యవసాయ శాఖ సిబ్బంది ధనలక్ష్మి, టీడీపీ నాయకులు కేవీ.ప్రసాద్‌కృష్ణ, మూర్తిబాబు, బొజ్జన్న పాల్గొన్నారు.

లంబసింగిలో రాయితీ విత్తనాల పంపిణీ

చింతపల్లి: లంబసింగి రైతు సేవా కేంద్రంలో శనివారం 90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆశాజ్యోతి మాట్లాడుతూ ఈ ఏడాది నాట్లకు ముందుగానే ప్రభుత్వం రాజ్‌మా విత్తనాలను సరఫరా చేస్తున్నదన్నారు. వర్షాలను సద్వినియోగం చేసుకుని రాజ్‌మా నాట్లు వేసుకోవాలని, తద్వారా మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం లంబసింగి, తాజంగి, పెదబరడ పంచాయతీలను ఎంపీడీవో సందర్శించారు. రక్షిత నీటి పథకాల శుద్ధి, కొళాయిల ద్వారా సరఫరా చేసిన నీటి పరీక్షలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గోవింద్, కూటమి నాయకులు లక్ష్మయ్య, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో సక్రమంగా అందని భోజనం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 6: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో మూడు రోజులుగా ఉచిత భోజనం సక్రమంగా అందడంలేదని రోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ విషయాన్ని శుక్రవారం సీహెచ్‌సీ సూపరిటెండెంట్ గీతాంజలితో పాటు సీపీఎం నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ సుమారు 60 మంది రోగులు ఉంటే 20 మందికి సరిపడా భోజనాలు తీసుకువచ్చి అందరికీ సరిపెడుతున్నారని, కూర పెట్టడం లేదని, పెట్టిన అరకొర భోజనం సైతం రుచీపచీ ఉండటం లేదని, ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సీహెచ్‌సీలో అందించే భోజనం తింటే రోగం మరి కాస్త ఎకువయ్యే ప్రమాదం ఉందని రోగులు వాపోయారు. దీంతో సీపీఎం నాయకులు త్రినాథ్, రామదాసు తదితరులు సీహెచ్‌సీకి వచ్చి నిర్వాహకులను నిలదీశారు. రోగులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. రోగులకు ఉచిత భోజనం సక్రమంగా అందే విధంగా తగు చర్యలు చేపడతామని సూపరింటెండెంట్ తెలిపారు.


గ్రామ సర్వేపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించండి: ఐటీడీఏ పీవో

పాడేరు రూరల్, సెప్టెంబరు 6: గిరిజన గ్రామాల్లో ఉన్న మౌలిక సదుపాయాలపై సమగ్రమైన సర్వే నిర్వహించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వే నిర్వహణపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గబ్బంగి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. అక్కడ ఉన్న తాగునీరు, అంతర్గత రహదారులు, పాఠశాల, వైద్య సేవలు, గిరిజనుల ఆర్థిక స్థితి తదితర సదుపాయాలపై యాప్ ద్వారా సమగ్ర సర్వే నిర్వహించి 8వ తేదీ ఆదివారం తనకు సమర్పించాలని ఆదేశించారు. సర్వే నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సర్వే వివరాలను గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కె.సాయి నవీన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో చవితి సందడి

... 3వ పేజీ తరువాయి

రోజుల్లో 20 రూపాయలు ఉన్న కొబ్బరికాయ శుక్రవారం రూ.30 నుంచి రూ.35లకు విక్రయించారు. అదేవిధంగా పూలు, పండ్లు, పత్రి తదితర పూజాసామగ్రిని వ్యాపారులు అధిక ధరలకు విక్రయించినా కొనుగోలుదారులు ఎక్కడా వెనుకాడకుండా కొనుగోలు చేశారు.

పాడేరులో ట్రాఫిక్ కష్టాలు

పాడేరులో శుక్రవారం వారపు సంతతోపాటు శనివారం వినాయక చవితి కావడంతో విగ్రహాలు, పూజ సామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితోపాటు వాహనాల రద్దీ విపరీతంగా ఉంది. మెయిన్ బజారు, అంబేడ్కర్ కూడలి, సినిమాహాలు సెంటర్, పీటీడీ కాంప్లెక్స్ రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. దీంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాల నియంత్రణపై పోలీసులు దృష్టి సారించకపోవడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెయిన్ రోడ్డులో ప్రయాణం చేసేందుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు.

మళ్లీ ముసురు!

... 3వ పేజీ తరువాయి

మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6.30 గంటల నుంచి కుండపోత వర్షం పడింది. శుక్రవారం సంత కావడం, శనివారం వినాయక చవితి కావడంతో అరకులోయ రోడ్లు రద్దీగా ఉన్నాయి. వర్షం కురవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బంది పడ్డారు.

హుకుంపేటలో..

మండలంలోని శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లో వరద నీరు చేరింది. మారుమూల గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

విద్యా శాఖ జేడీ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

... 3వ పేజీ తరువాయి

ప్రభుత్వం సూచిస్తున్న, అమలు చేస్తున్న కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులంతా విధిగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు నిర్వహించే సమ్మిట్ పరీక్షను పక్కాగా నిర్వహించాలని జేడీ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, అసిస్టెంట్ డైరెక్టర్లు వినయ్ మోహన్, జి.అప్పారావునాయుడు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్ పాల్గొన్నారు.

బంగారుబుడ్డిలో జ్వరాలు


రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

హుకుంపేట, సెప్టెంబరు 6: మండలంలోని భీమవరం పంచాయతీ బంగారుబుడ్డి గ్రామంలో వైరల్ జ్వరాలు ప్రబలాయి. ప్రతి ఇంటిలో జ్వర బాధితులు ఉన్నారు. గ్రామస్థులు హుకుంపేట ఆస్పత్రికి ఫిర్యాదు చేయడంతో పీహెచ్‌సీ హెల్త్ పర్యవేక్షణ అధికారి మహేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శుక్రవారం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి జ్వర బాధితులకు పరీక్షలు జరిపి మందులు అందించారు. ముఖ్యంగా మలేరియా పరీక్షలు చేశారు. ఈ సీజన్‌లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, జ్వరం వచ్చిన వెంటనే వైద్య సేవలు పొందాలని మహేశ్వరరావు కోరారు. వ్యాధులు తగ్గని పక్షంలో పంచాయతీ ఏఎన్ఎంకు లేదా ఆశ వర్కర్‌కు సమాచారం అందించాలని కోరారు. గ్రామంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కరరావు, ఏఎన్ఎం, ఆశ వర్కర్, సిబ్బంది వైద్య సేవలు అందించారు.

సాగు భూమి అప్పగించాలని గిరిజనుల ఆందోళన

పాడేరు రూరల్, సెప్టెంబరు 6: పురాతనం నుంచి సాగు చేసుకుంటున్న భూమిపై జిల్లా కలెక్టర్ స్వయంగా విచారణ చేపట్టి తమకు అప్పగించాలని గిరిజనులు కోరారు. ఈ మేరకు జిల్లాలోని రాజవొమ్మంగి మండలం శరభవరం పంచాయతీ అప్పన్నపాలెం గ్రామానికి చెందిన ముర్ల రత్నం, ముర్ల ముని, ముర్ల గంగయ్య కుటుంబాలు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ ఆదివాసీ హక్కుల సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కళ్యాణ్ మాట్లాడుతూ చాకలి మాన్యం పేరిట పిలిచే ఈ భూములో ముర్ల కుటుంబ సభ్యులు తాతలు నుంచి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని అనేక పర్యాయాలు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. వైసీపీ ప్రభుత్వం గ్రామంలో రీసర్వే నిర్వహించి కొత్త పట్టాలు ఇస్తామని చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులతో పాటు సంఘం సమాయ కార్యదర్శి ఎ.పవన్, పి.రమణబాబు, పి.కొండబాబు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, సెప్టెంబరు 6: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ నెల 11వ తేదీ వరకు పాడేరు, చింతపల్లి, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా ఆరు మిల్లీమీటర్లు నుంచి గరిష్ఠంగా 27 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. వర్షాల వల్ల పంటల్లో చీడపీడల ఉధృతి అధికంగా కనిపిస్తుందని, వర్షాలు తగ్గిన తరువాత సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన చెప్పారు.

ప్యాకేజీ తేల్చాకే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు పనులు చేపట్టాలి

సీలేరు, సెప్టెంబరు 6: ప్యాకేజీలు ఇచ్చిన తరువాతే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు స్పష్టం చేశారు. సీలేరు, దుప్పులవాడ పంచాయతీల పరిధిలోని పార్వతీగనర్, శాండికోరి గ్రామాల్లో పంప్డ్ స్టోరేజీ నిర్వాసితులను ఖాళీ చేయాలంటూ సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేయడంతో ఆయన స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఆయా గ్రామాలను సందర్శించి గిరిజనులతో చర్చించారు. ప్యాకేజీ ఇవ్వకుండా పనులు చేపడితే గిరిజనులతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అలాగే నిర్వాసితుల్లో చాలా మందికి సాగు భూమి పట్టాలు లేవని అటువంటి వారికి కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించినప్పుడే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణానికి తామంతా సహకరిస్తామని చెప్పారు. దీనిపై జెన్‌కో అధికారులు మాట్లాడుతూ ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, సీలేరు ఎస్ఈ రామభద్రరాజు, ఏడీఈ టి.అప్పలనాయుడు, ఏఈఈ సురేష్, ఎంపీపీ బోయిన కుమారి, సీలేరు సర్పంచ్ దుర్గో, ధామనాపల్లి సర్పంచ్ కె.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు పిల్లా సాంబమూర్తి, వైసీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

శివలింగపురంలో వైద్య శిబిరం

అనంతగిరి, సెప్టెంబరు 6: శివలింగపురం గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. అనంతగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి జ్ఞానేశ్వరి విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన మందులను అందజేశారు. అనంతరం ఎంపీడీవో నగేష్ పాఠశాలను సందర్శించి ఆర్వోప్లాంట్ మరమ్మతులు చేయించాలని, నీటి నిల్వలేకుండా చర్యలు చేపట్టాలని హెచ్ఎంకు ఆదేశించారు. అలాగే గురువారం రాత్రి పాఠశాలలోని 13 మంది విద్యార్థులు జ్వరాల బాధపడడంతో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ రక్తపరీక్షలు చేయగా ఇద్దరికి మలేరియా నిర్ధారణ కాగా, 11 మందికి వైరల్ జ్వరాలు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, హెచ్ఎం ఎస్.సుబ్బారావు, ఎంపీహెచ్ఈవో నరసంగరావు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతు

పెదబయలు, సెప్టెంబరు 6: ఇంజరి పంచాయతీ గబుడుపుట్టు గ్రామ పరిధిలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వర్షాలకు కొట్టుకుపోయిన ప్రధాన రహదారిని స్థానికులు శుక్రవారం శ్రమదానంతో మరమ్మతు చేసుకున్నారు. కనీసం ద్విచక్ర వాహనం కూడా నడపలేని స్థితిలో అధ్వానంగా తయారైన ఈ రోడ్డును గిరిజనులు పార, గునపాలు చేతబట్టి రోడ్డును సదును చేసుకున్నారు. గ్రామాలకు మంజూరైన ప్రధాన రహదారి నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఇంజరి పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

అరకులోయ, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు అరకు, సంతబయలు వారపు సంతల్లో శుక్రవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజలు వరద ముంపుకు గురై ఇళ్లను విడిచి సురక్షి ప్రాంతాలలో తలదాచుకుంటున్నారని, ఇటువంటి ఘోర పరిస్థితుల్లో అందరూ మానవతా దృక్పథంతో విరాళాలు ఇచ్చి వారికి సాయపడాలని కోరారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 6: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో లక్ష్మీదేవి సూచించారు. రింతాడ పంచాయతీ గుర్రాళ్లగొంది అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. ఆహారంలో పప్పు ధాన్యాలు, కూరగాయలు ఉండాలన్నారు. ప్రసవ సమయానికి 15 రోజుల ముందుగానే ఆస్పత్రిలో చేరాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినయ్, వైద్య సిబ్బంది కృష్ణకుమారి, వలసమ్మ, మోహిని, శాంతి పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

డుంబ్రిగుడ, సెప్టెంబరు 6: భారీ వర్షాలతో గ్రామాల్లో అందరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ హిమగిరి సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎడ తెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయన్నారు. వాగులు, వంకలు, గెడ్డలు పొంగి ప్రవహించే పరిస్థితి ఉందని, అందువల్ల వర్షాలు కురిసినప్పుడు గ్రామాల్లోనే సురక్షితంగా ఉండాలని కోరారు. భారీ వర్షాల కారణంగా అరకు, విశాఖ ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉండడంతో రాత్రి ఏడు నుంచి మరుసటి రోజు ఉదయం ఆరు గంటల వరకు వాహనాల ప్రయాణాలను నిలుపుదల చేస్తున్నామని చెప్పారు. ఈ విషయాన్ని గమనించి వాహనదారులు, పర్యాటకులు సహకరించాలని కోరారు. చవితి ఉత్సవాలను నిర్వహించే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆయన తెలిపారు.

ఏరియా ఆస్పత్రి ఎదుట సెక్యూరిటీ గార్డుల ఆందోళన

చింతపల్లి, సెప్టెంబరు 6: ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సెక్యూరిటీ గార్డులు వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళనకు దిగారు. శుక్రవారం భోజన విరామ సమయంలో ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డులు మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో మే నుంచి జీతాలు రాలేదన్నారు. 14 మంది పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందలేదని వాపోయారు. ప్రభుత్వం తమ సమస్యను గుర్తించి బకాయి వేతనాలు ఇవ్వాలని చెప్పారు. సెక్యూరిటీ గార్డుల సంఘ సభ్యులు లక్ష్మణరావు, బొంజుబాబు, సాయిలక్ష్మి, దారలక్ష్మి పాల్గొన్నారు.